క్లుప్తంగా

వర్షం.. హర్షం..



నగరి పట్టణంలో కురుస్తున్న వర్షం

నగరి : సూర్యప్రతాపానికి, ఉక్కపోతకు అల్లాడిపోయిన నగరి ప్రజలకు ఆదివారం కురిసిన వర్షం చల్లదనాన్ని ఇచ్చింది. గత కొంతకాలంగా పగటి పూట అధిక ఉష్ణోగ్రతలతో పాటు, రాత్రి పూట సైతం ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయి. రుతుపవనాల రాకతో ఆదివారం ఉదయం నుంచి వాతావరణం చల్లబడింది. ఆకాశం మేఘావృతమైంది. కొన్ని గంటల పాటు వర్షం కురవడంతో ప్రజల ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు. మరిన్ని రోజులు ఇలా వర్షం పడితే ఉష్ణోగ్రతలు తగ్గి వాతావరణం సాధారణ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

పుత్తూరురూరల్: ఒకసారి నేరం చేసిన వారు మళ్లీ అలాంటి తప్పిదాలకు పాల్పడకుండా జీవితాన్ని సన్మార్గంలో నిలుపుకోవాలని డీఎస్పీ వై.శ్రీనివాసరావు సూచించారు. ఆదివారం పుత్తూరు పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు జీవితం పట్ల అవగాహన కల్పించారు. మిమ్మల్ని నమ్ముకుని కుటుంబ సభ్యులు ఉంటారని, వారితో పాటు మీరు తలెత్తుకుని జీవించేలా ప్రవర్తన సరిగా ఉండాలని చెప్పారు. రౌడీషీటర్లుగా ముద్రపడిన మీ అందరిపై పోలీసుల దృష్టి ఎప్పుడూ ఉంటుందన్నారు. మీ వల్ల శాంతి భద్రతలకు విఘాతం కలిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నేడు ద్విచక్ర వాహనాల వేలం

శ్రీరంగరాజపురం : వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 2 ద్విచక్ర వాహనాలను సోమవారం ఉదయం 11 గంటలకు వేలం డీఎస్పీ సమక్షంలో వేలం వేయనునట్లు ఎస్‌ఐ షెక్షావలి తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ముందుగా ధరావత్తు చెల్లించాలని సూచించారు. వెహికల్ ఇన్‌స్పెక్టర్ వారు నిర్ణయించిన ధర కంటే హెచ్చు పాడిన వారికి వాహనాలను అప్పగిస్తామని తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

విజయపురం (నగరి) : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ ఏలుమలై అన్నారు. ఆదివారం ఆయన పన్నూరులోని జగనన్న కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి నిర్ణీత గడువులోపు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంట్, స్టీల్, విద్యుత్ పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. లబ్ధిదారులు కూడా త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని, పూర్తి చేసిన వారికి సకాలంలో బిల్లులు చెల్లిస్తామని తెలిపారు.

శిల్పారామం.. కళావైభవం

తిరుచానూరు (చంద్రగిరి) : తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం సాంస్కృతిక వైభవం వెల్లివిరిసింది. నెల్లూరుకు చెందిన శ్రీనటరాజ కళాక్షేత్రం గురువు త్రిపుర నిఖిత పర్యవేక్షణలో కళాకారులు ప్రదర్శించిన భరతనాట్యం అలరించింది. నృత్యలహరిలో భాగంగా మహాదేవ సుతం, కంటి అఖిలాండ, బ్రహ్మమొక్కటే, జయలక్ష్మీ, చక్కని తల్లికి, ఇదిగో భద్రాద్రి, శంభో స్వయంభో, చిన్ని శిశువు, దశవతారాలు, దేవదేవం భజే, రామభజన, మంగళం తదితర కీర్తనలు, గీతాలకు కళాకారులు అశ్రిత, గీతా కృష్ణ, హర్షర కృష్ణ, జ్ఞాన హర్షిత, లిఖిల సాహితి, పల్లవి, జైశ్వ, తపస్విని హావభావాలు, అభినయం ఆకట్టుకుంది. ప్రేక్షకుల కరతాళ ధ్వనులతో శిల్పారామ ప్రాంగణం మార్మోగింది.

వినమ్రతతో సేవలు..

అమ్మా నేను వలంటీర్‌ను.. మీ ఇంట్లో ఏవైనా సమస్యలు ఉన్నాయా ? మీకు పథకాలు అందడంతో ఇబ్బందులు తలెత్తాయా ? ఏ సమస్య అయినా చెప్పండి.. మీకు నేను సాయం చేస్తా.. అంటూ వలంటీర్లు తమకు కేటాయించిన ఇళ్ల వద్దకు వెళ్లి ప్రజలను వినమ్రతతో పలకిరించి సేవలందిస్తున్నారు. ప్రభుత్వ పథకాలు అందే మీ తరపున మేమే దరఖాస్తు చేస్తాం అని అడుగుతున్నారు. ఇలా గ్రామం, పట్టణం అనే తేడా లేకుండా వలంటీర్లు గడప గడపకు తిరుగుతూ ప్రజలతో మమేకమవుతున్నారు.

- ప్రతి గడపను పలకరిస్తున్న వలంటీర్లు
- సమస్యలు ఉంటే చెప్పాలంటూ విన్నపం
- ప్రభుత్వ పథకాలను వివరిస్తున్నారు



గ్రామాల్లో ఇంటింటా సమాచారం సేకరిస్తున్న వలంటీర్ (ఫైల్)

పాలసముద్రం: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ పట్ల అన్ని వర్గాల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ప్రజల సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపడమే కాకుండా వారికి ప్రభుత్వ పథకాలను వారి ఇళ్ల వద్దే అందిస్తూ అందరి ఆదరాభిమానాలను చూరగొంటున్నారు వలంటీర్లు. గ్రామం, పట్టణం అనే తేడా లేకుండా అంతటా వీరు సేవలు అందిస్తున్నారు. తమకు కేటాయించిన ఇళ్ల వద్దకు వెళ్లి ప్రజలతో మమేకమవుతున్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ తగిన సూచనలు, సలహాలు ఇస్తున్నారు. వలంటీర్లు తమకు కేటాయించిన ఇళ్లను సందర్శిస్తూ ప్రజలను పరిచయం చేసుకునేందుకు గ్రామాల బాట పట్టారు.

ఇంటి వద్దకే పథకాలు..

గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ఈ ప్రభుత్వంలో ప్రభుత్వ ప్రతినిధులే ప్రజల గడప వద్దకే వచ్చి సమస్యలు తెలుసుకుని నమోదు చేసుకుంటారు. ఆపై పరిష్కారం చూపుతున్నారు. ప్రజల ఇళ్ల వద్దకే వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించడంతో పాటు వారికి ఆ పథకాలు అందేలా చొరవ చూపుతారు. అయితే గతంలో కాళ్లరిగేలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినప్పటికీ తమ సమస్యలు ఏమాత్రం తీరేవికావని, కనీసం తమ బాధలు చెప్పుకునేందుకు కూడా సరైనా అవకాశం లభించేది కాదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వలంటీర్లు రాకతో తమకు అవస్థలు తీరినట్లేనని, ఇక మీదట ఎవరిని ఆశ్రయించాల్సిన పని ఉండదని తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో త్వరితగతిన తీరుతాయని ఆనందపడుతున్నారు.

మండలం	పంచాయితీలు	కుటుంబాలు	వలంటీర్లు
గంగాధరనెల్లూరు	32	17342	328
శ్రీరంగరాజుపురం	23	10670	194
కార్వేటినగరం	21	8903	178
వెదురుకుప్పం	25	12870	234
పెనుమూరు	24	10250	205
పాలసముద్రం	13	6105	111

లబ్ధిదారుల ఇంటికే సంక్షేమ ఫలాలు..

ప్రభుత్వం ప్రజలకు అందించే ప్రతి సంక్షేమ ఫలాలను నేరుగా లబ్ధిదారుడి ఇంటి వద్దకే వెళ్లి గ్రామ వలంటీర్లు అందజేస్తున్నారు. రేషన్‌కార్డుల్లో మార్పులు, కొత్తగా పింఛన్, రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు కూడా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేదు. కూలీలు, చిరుద్యోగులు తమ పనులు మానుకుని రోజుల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేదు. వలంటీర్లకు సమస్య చెబితే చాలు. వారు నమోదు చేసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంతో పాటు సంక్షేమ పథకాల లబ్ధి అందేలా కృషి చేయనున్నారు.

మంచి అవకాశం..



ముఖ్యమంత్రి నాకు మంచి అవకాశం ఇచ్చారు. ప్రజలకు సేవ చేసే భాగ్యం లభించింది. ప్రభుత్వ పథకాలను నాకు కేటాయించిన ఇళ్ల వద్దకు ప్రతి లబ్ధిదారుడికి అందజేస్తాం. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తాం. ఈ అవకాశం రావడం నా అదృష్టం. – విజయకుమార్, శ్రీకావేరిరాజుపురం, వలంటీర్

గౌరవంగా భావిస్తున్నా..



ప్రభుత్వం కల్పించిన వలంటీర్ జాబ్ నా కుటుంబానికి ఆర్థిక ఆసరాగా నిలబడడంతో పాటు, గ్రామ ప్రజలకు సేవ చేసే అదృష్టం దక్కింది. దీన్ని ఎంతో గౌరవంగా భావిస్తున్నాను. అధికారులు నాకు అప్పగించిన పనులను సకాలంలో పూర్తి చేస్తాను. నాకు కేటాయించిన కుటుంబాల్లోని వారికి సంక్షేమ ఫలాలు త్వరగా అందేలా చూస్తాను. – ఎం.ప్రసన్న, వెంగళరాజుకుప్పం, పంచాయతీ

ప్రజల ఇళ్ల వద్దకే పథకాలు



వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు ద్వారా సంక్షేమ పథకాల ఫలాలు నేరుగా ప్రజల ఇళ్ల వద్దకే చేరుతాయి. వలంటీర్‌గా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అన్ని సంక్షేమ పథకాలను అర్హులకు అందించేందుకు కృషి చేస్తున్నా. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పని చేస్తున్నా. సంక్షేమ పథకాలతో పాటు వారికి ప్రభుత్వం నుంచి అందాల్సిన ఎటువంటి లబ్ధి అయినా సరే అందే వరకు కృషి చేస్తాను. – ఎం.కల్పన, నరసింహపురం, పంచాయతీ

బాధ్యతగా పని చేస్తున్నా..



గ్రామ వలంటీరుగా నాకు అప్పగించిన విధులు సక్రమంగా నిర్వహిస్తున్నా. విధి నిర్వహణలో ఎప్పుడూ నిర్లక్ష్యం వహించలేదు. బాధ్యతాయుతంగా పని చేస్తాను. 50 కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందిస్తూ వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నాను. ప్రజలకు మంచి చేసే అవకాశం రావడం నా అదృష్టం. – జే.దీప, దీనబంధుపురం

సీఎం మేలు మరువలేను..



గ్రామ వలంటీరుగా శిక్షణలో అన్ని విషయాలు తెలుసుకున్నాను. 50 కుటుంబాల వారికి సేవ చేసే అవకాశం కల్పించడమే కాకుండా గౌరవ వేతనంగా రూ.5 వేలు ఇస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేలును మరచిపోలేను. వలంటీరుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు సక్రమంగా అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తున్నా. – పి.పవిత్ర, పాలసముద్రం

ఎంపీపీల సంఘ కార్యదర్శిగా మునివేలు



కె.మునివేలు

పుత్తూరు రూరల్: తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ ఎంపీపీల సంఘ కార్యదర్శిగా పుత్తూరు ఎంపీపీ కె.మునివేలు నియమితులయ్యారు. రాష్ట్ర ఎంపీపీల సంఘ కన్వీనర్, అమరావతి ఎంపీపీ మేకల హనుమంతరావు ఆధ్వర్యంలో జరిగిన తిరుపతి జిల్లా కమిటీ సమావేశంలో జిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షుడిగా వెంకటగిరి ఎంపీపీ తనూజా, గౌరవాధ్యక్షులుగా సత్యవేడు ఎంపీపీ వి.ప్రతిమ, ఉపాధ్యక్షులుగా వడమాలపేట ఎంపీపీ విజయలక్ష్మీ, ప్రధాన కార్యదర్శిగా రేణిగుంట ఎంపీపీ కె.హరిప్రసాద్‌రెడ్డి, అధికార ప్రతినిధిగా వరదయ్యపాళెం ఎంపీపీ పద్మప్రియ, కార్యదర్శులుగా పుత్తూరు, బుచ్చినాయుడుకండ్రిగ ఎంపీపీలు కె.మునివేలు, ఎం.సుబ్బలక్ష్మీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మునివేలు మీడియాతో మాట్లాడుతూ తమ సంఘం రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి అన్ని విధాలా కృషి చేస్తుందని చెప్పారు.

పరిసరాల శుభ్రత పాటించండి

విజయపురం (నగరి) : పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యమని డాక్టర్ సోమశేఖర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా వైద్యసిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. రాత్రిపూట దోమతెర వాడాలని, వేడి చేసి చల్లార్చిన నీటి తాగాలన్నారు. దోమలు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ప్రతి గ్రామంలో ఫాగింగ్ చేయించాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా జ్వరం, జలుబు, దగ్గు, ఒళ్లు, కీళ్లనొప్పులతో బాధ పడుతుంటే స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించాలన్నారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందించాలని ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలకు ఆదేశాలు జారీ చేశారు.

అపూర్వ కలయిక



గురువులను సన్మానిస్తున్న ఆంధ్రకేసరి పూర్వ విద్యార్థులు

పుత్తూరు రూరల్: స్థానిక గేట్‌పుత్తూరులోని ఆంధ్ర కేసరి పాఠశాల పరిసరాలు పూర్వ విద్యార్థుల కలయికతో సందడిగా మారింది. ×రేయ్.. బాలా సార్ వస్తున్నాడు రోయ్ అంటూ నాటి జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ మురిసిపోయారు. చిన్ననాటి ఘటనలను గుర్తు చేసుకుంటూ, ఒకరినొకరు పలకరించుకున్నారు. ప్రస్తుత జీవన స్థితిగతుల గురించి పంచుకున్నారు. ఆదివారం స్థానిక ఆంధ్రకేసరి స్కూల్‌లో 1995–96 విద్యా సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. ఇదే పాఠశాలలో వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు వసంత, గీత, కన్నెమ్మ, జయశ్రీ, విజయలక్ష్మి, సెల్వరాజ్, సుబ్రమణ్యం, వెంకటకృష్ణ, నాగేంద్రతో పాటు హెచ్‌ఎం బాలసుబ్రమణ్యంను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు వేలు, గోవింద్, దిలీప్, రవిశంకర్, సందీప్, సుజాత, పుష్పలత, దశరథన్, శశికళ, అమ్మాజీ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

సీనియారిటీ ప్రకారమే ప్రమోషన్లు కల్పించండి



మాట్లాడుతున్న వెంకటముని

పుత్తూరు రూరల్: ప్రభుత్వ, పంచాయతీ రాజ్ ప్రధానోపాధ్యాయులను ఉమ్మడి సీనియారిటీ ప్రకారమే ఎంఈఓలుగా ప్రమోషన్లు కల్పించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటముని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవనంలో ఏపీటీఎఫ్ డివిజన్‌స్థాయి సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పనిచేస్తున్న ఎంఈఓలను ఎంఈఓ–1గా కొనసాగించాలని కోరారు. ఉమ్మడి సర్వీసు రూల్స్‌ను రూపొందించడంలో ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, రమేష్, నరేంద్ర, అమర్‌నాథ్ రెడ్డి, మావూళ్లయ్య, కన్నెప్ప, విజయ్, గురప్ప, శరవణ, బాబు పాల్గొన్నారు.

సీఎం జగనన్నది ముప్పై ఏళ్ల ముందుచూపు

- ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుంది
- 2024 ఎన్నికల్లో విజయమే లక్ష్యం
- వైఎస్సార్‌సీపీ నేత రామ్‌ప్రసాద్‌రెడ్డి



రామ్‌ప్రసాద్‌రెడ్డిని సత్కరిస్తున్న వడమాలపేట నాయకులు

పుత్తూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముప్పై ఏళ్ల ముందు చూపుతో పాలన సాగిస్తున్నారని పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం వడమాలపేట మండలం తట్నేరి గ్రామ ఆశ్రమంలో టీసీ అగ్రహారం సచివాలయ పరిధిలోని పార్టీ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తొలిసారి అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల ఆర్థిక స్థితిగతులను పటిష్ట పరిచేందుకు నిరివ్రామంగా కృషి చేస్తోందని తెలిపారు. అదే సమయంలో ప్రతి కార్యకర్తకు పార్టీ తగిన గుర్తింపునిచ్చి అండగా నిలబడుతుందని స్పష్టం చేశారు. మంత్రి రోజా నేతృత్వంలో నగరి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని తెలిపారు. రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త, నాయకుడిపై ఉందన్నారు. అంతకుముందు ఆయనకు మండల నాయకులు ఘన స్వాగతం పలికి, గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు డైరెక్టర్ కరుణాకర్ చౌదరి, పీఎంసీ వైస్ చైర్మన్ శేఖర్, మండల పార్టీ కన్వీనర్ సుబ్రమణ్యం రెడ్డి, శాప్ డైరెక్టర్ యాదవేంద్రరెడ్డి, సచివాలయ కన్వీనర్ సురేష్‌రాజు, సర్పంచులు ధర్మయ్య, మంజుల, పార్టీ నాయకులు సుధాకర్‌రెడ్డి, గంగాధరమ్, మంగిరెడ్డి, రవిరెడ్డి, మునిబాబు, నందయ్య, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ పశుబీమాను సద్వినియోగం చేసుకోండి

విజయపురం (నగరి) : పాడి రైతులు, గొర్రెలు పెంపకందారులు వైఎస్సార్ పశు బీమాను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి శివమూర్తి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాడి రైతులు, గొర్రెలు పెంపకందారులతో వైఎస్సార్ పశుబీమాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుబీమాతో పశువులు మృతి చెందినా నష్టపరిహారం అందుతుందన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పాడి రైతులు, గొర్రెలు పెంపకందారులు 20 శాతం ప్రీమియం చెల్లిస్తే, 40 శాతం రాష్ట్రప్రభుత్వం, 40 శాతం కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తాయన్నారు. గేదె జాతి అయితే మూడు నుంచి 12 ఏళ్లలోపు, గొర్రెలు అయితే ఆరు నెలలు పైబడి ఉండాలన్నారు. ఒక్కో కుటుంబానికి ఐదు పశువులు, 50 గొర్రెలు వరకు బీమా చేయించుకునే అవకాశం ఉందని తెలిపారు. బీమా వర్తించాలంటే పశువు, గొర్రెకు చెవి పోగు తప్పనిసరిగా వేయించాలని సూచించారు.

ఆగస్టు 7న జాతీయ ఓబీసీ మహాసభ



సమావేశంలో ఐక్యత చాటుతున్న ఏపీ బీసీ సంక్షేమ సంఘం నేతలు

తిరుపతి కల్చరల్: బీసీల అభ్యున్నతే లక్ష్యంగా ఆగస్టు 7వ తేదీన తిరుపతి నగరంలో భారీ స్థాయిలో జాతీయ ఓబీసీ మహాసభ నిర్వహించనున్నట్టు ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరి నాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభ నిర్వహణపై వివిధ జిల్లాల నేతలతో చర్చించారు. ఆయన మాట్లాడుతూ గతంలో బీపీ మండల్ కమిషన్ ఇచ్చిన నివేదికను అమలు చేయడంలో ప్రభుత్వాలు వివక్ష చూపాయని, దీంతో బీసీల బతుకులు మరింత దిగజారాయన్నారు. దేశ వ్యాప్తంగా బడుగు, బలహీన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు సుమారు 85 శాతం ఉన్నా అభివృద్ధి శూన్యమన్నారు. బీపీ మండల్ నివేదిక సమర్పించిన రోజైన ఆగస్టు 7వ తేదీన తిరుపతి నగరంలో నిర్వహించనున్న జాతీయ ఓబీసీ మహాసభను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్‌కే.యాదవ్, నాయకులు వెంకటేశ్వర్లు, రఘుపతి, జ్ఞాన జగదీష్, బ్రహ్మానంద శర్మ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొండపై తగ్గని రద్దీ

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. వేసవి సెలవులు ముగిసినా భక్తులు పెద్ద సంఖ్యలో శ్రీవారి దర్శనం కోసం తరలివస్తున్నారు. శ్రీవారి మెట్లతో పాటు అలిపిరి మార్గంలో కాలినడకన పెద్ద సంఖ్యలో వస్తున్నారు. క్యూకాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. భక్తులకు ఇబ్బందులు లేకుండా టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

- తిరుమల



మాడవీధిలో ఉన్న భక్తులు





కాలినడకన వస్తున్న భక్తులు




అఖిలాండం వద్ద పూజలు



మెట్ల మార్గంలో భక్తుల పూజలు



క్వారీ.. వర్రీ



సేలం ఇండ్లు గ్రామంలో బీటలు వారిన ప్రహరీ



ఇంటి ముందు పడిన రాయి

వరదయ్యపాళెం: మండలంలోని మరదవాడ సమీపంలో ఉన్న ఎస్‌ఎస్‌పీఆర్ క్వారీతో సేలం ఇండ్లు వాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. క్వారీ బ్లాస్టింగ్‌లతో నిత్యం భయభ్రాంతులకు గురవుతున్నట్లు వాపోతున్నారు. క్వారీ పేలుళ్ల ధాటికి ఇళ్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయి. బండ రాళ్లు ఎగిరి పడుతుండడంతో ఏ సమయంలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితిలో ఉన్నామని స్థానికులు చెబుతున్నారు. కనీస భద్రతా చర్యలు చేపట్టకుండా ఇళ్ల సమీపంలో క్వారీకి ఎలా అనుమతి ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.